E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 13-09-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

## 15వ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్



తరువాయి 2లో

» మోదీ, ఖర్గే, కేంద్ర మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్య, అన్సారీ, ధన్‌ఖడ్ హాజరు
» ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా..
» హాజరు కాని రాహుల్ గాంధీ, ఇతర విపక్షాల నేతలు

ఈకబురు, న్యూఢిల్లీ,: భారత 15వ ఉపరాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో పదవీప్రమాణం చేయించారు. రాధాకృష్ణన్ తమిళ సంప్రదాయ దుస్తులు, ఎర్ర కుర్తా ధరించి వచ్చిన ఆయన.. భగవంతుడిపై ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి

» ఆ వెంటనే కీలక అధికారులతో భేటీ
» వచ్చే ఏడాది మార్చి 4న ఎన్నికలకు ప్రతిపాదన
» అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా నేపాల్‌లో ఎమర్జెన్సీకి సిఫారసు
» ప్రభుత్వంలో చేరని 'జెన్ జెడ్' ప్రతినిధులు
» హోటల్‌కు నిరసనకారుల నిప్పు.. కిందికి దూకిన భారతీయురాలి మృతి
» భారతీయ పర్యాటకుల బస్సుపై రాళ్లు



తరువాయి 2లో

## 5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన



» ప్రధాని మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మిజోరం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్....
» నేటి నుంచి మూడు రోజులు బిజీబిజీ
» అల్లర్ల తర్వాత తొలిసారిగా మణిపూర్‌కు

తరువాయి 2లో

ఈకబురు, న్యూఢిల్లీ : ప్రధాని మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మిజోరం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటిస్తారని, రూ.71,850 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ప్రధాని కార్యాలయం(పీఎంవో) శుక్రవారం వెల్లడించింది. మణిపూర్‌లో 2023 మేలో జాతుల మధ్య వైరంతో హింస చెలరేగిన తర్వాత ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి. మూడు రోజుల పర్యటనలో భాగంగా మోదీ తొలుత శనివారం మిజోరం వెళ్లనున్నారు. ఐజ్వాల్‌లో ఉదయం రూ.9 వేల కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి మణిపూర్ చేరుకొని..

## ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాహుల్‌గాంధీ మాట్లాడాలి



» 2లో

## త్వరలో భారత్‌కు ట్రంప్!

క్వాడ్ సదస్సుకు హాజరయ్యే అవకాశం

భారత్‌ను చైనాకు దూరం చేయడమే లక్ష్యం


భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడి

» 2లో



## ప్రపంచం కోరుకుంటోంది మహిళల నాయకత్వాన్నే

» 5లో



## పన్ను రిఫండ్ ఇంకా రాలేదా? కారణం ఇదే అయ్యుండొచ్చు!

» 4లో



## బాణసంచాపై నిషేధం ఢిల్లీకే పరిమితం ఎందుకు?

» 3లో



## లోకసభల్లోనే వారసులెక్కువ!



543 మంది ఎంపీల్లో 31% మంది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలవారే!

దేశంలోని అసెంబ్లీల్లో 20%, శాసన మండలిల్లో 22%

ఏపీలో 8, తెలంగాణలో 11 మంది ఎంపీలు వారసులే

పురుషుల కన్నా మహిళల్లోనే అధికం: ఏడీఆర్ నివేదిక

జాతీయ పార్టీల్లో కాంగ్రెస్‌లో వారసులెక్కువని వెల్లడి

తరువాయి 3లో

## ఇక బొగ్గు గనుల వేలంలో సింగరేణి



» గత పాలకులు సంస్థ పాల్గొనకుండా అడ్డుకున్నారు
» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఈకబురు హైదరాబాద్ : ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో ఎమ్మెల్యే విజయ రమణారావు, సింగరేణి సీఎండీ బలరాంతో కలసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ''గత భారత రాష్ట్ర సమితి పాలకులు ప్రైవేటు సంస్థలకు మేలు చేసేందుకే బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకున్నారు. ప్రజలకు, సంస్థ కార్మికులకు భ్రమలు కల్పించి.. భావోద్వేగాలను రెచ్చగొట్టి తమకు కావాల్సిన వారికి మేలు చేసేందుకు సింగరేణిని వేలంలో పాల్గొనకుండా అడ్డుకుంది. మేం అధికారంలోకి వచ్చిన తరవాత వాస్తవాలపై అధ్యయనం చేస్తే.. గనుల వేలంలో సింగరేణి పాల్గొంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా, కొత్త గనులు సంస్థకు దక్కుతాయని తేలింది. ఇకనుంచి వేలంలో గనులను కొనడానికి అనుమతిస్తున్నాం. ప్రస్తుత ఏడాది 72 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్న సింగరేణికి.. కొత్త గనులు రాకపోతే 2043 44 సంవత్సరానికి ఉత్పత్తి 31 మి.ట.కు పడిపోతుంది. దీనివల్ల అక్కడ పనిచేస్తున్న 70 వేల మంది కార్మికులు, ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. బొగ్గుకే పరిమితం కాకుండా కర్ణాటకలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణ ప్రాజెక్టును ఇటీవల కేంద్రం నిర్వహించిన వేలంలో సింగరేణి దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా కీలక ఖనిజాల తవ్వకాలను చేపట్టేందుకు గల అవకాశాలపై అధ్యయనానికి ఒక ఏజెన్సీని సంస్థ నియమించింది. ఏజెన్సీ నివేదిక వచ్చాక.. 'సింగరేణి గ్లోబల్' పేరుతో ఇతర దేశాల్లోనూ ఖనిజాల ఉత్పత్తికి సింగరేణి సిద్ధమవుతుంది'' అని భట్టి చెప్పారు.

తరువాయి3లో

## సైదాపూర్‌లో భారీ వర్షం.. వసతి గృహం చుట్టూ చేరిన వరదనీరు



» 3లో

## భారీ వర్షాలతో కామారెడ్డి సభ వాయిదా



» 2లో

## దక్షిణాది కుంభమేళాలా గోదావరి పుష్కరాలు



బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి

ఒకే రోజు 2 లక్షల మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

శాశ్వత ప్రాతిపదికన పనులు

సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ఈకబురు ,హైదరాబాద్: గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. బాసర నుంచి భద్రాచలం వరకు నదీ తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతోపాటు అన్ని ప్రధాన దేవాలయాలను అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. దక్షిణ భారత కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 2027 జులై 23 నుంచి మొదలయ్యే గోదావరి పుష్కరాలకు దాదాపు 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలి వచ్చినా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణం, వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లు, అవసరమైన అన్ని వసతులు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. దాదాపు 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరేలా..

''ప్రస్తుతం ఉన్న పుష్కర ఘాట్లను విస్తరించాలి. రోడ్లు, ఇతర వసతులకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

తరువాయి 2లో

## అందుకే సామాజిక మాధ్యమాలకు దూరం

» 5లో



## ఆసియా కప్.. ప్చ్.. అభిమానుల్లో ఏదీ ఆసక్తి!

» 6లో



మొదటి పేజీ తరువాయి

## 5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన



71,850కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ప్రధాని కార్యాలయం (పీఎంవో) శుక్రవారం వెల్లడించింది. మణిపూర్‌లో 2023 మేలో జాతుల మధ్య వైరంతో హింస చెలరేగిన తర్వాత ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి. మూడు రోజుల పర్యటనలో భాగంగా మోదీ తొలుత శనివారం మిజోరం వెళ్లనున్నారు. ఐజ్వాల్‌లో ఉదయం రూ.9 వేల కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి మణిపూర్ చేరుకొని.. చురచాంద్‌పూర్‌లో మధ్యాహ్నం రూ.7,300 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత రాజధాని ఇంఫాల్‌లో రూ.1,200కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొన్న తర్వాత అసోం వెళ్తారు. సాయంత్రం గువాహటిలో జరిగే భారతరత్న భూపేన్ హజారికా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. 14వ తేదీన ప్రధాని మోదీ అసోంలో రూ.18,530 కోట్ల కీలకమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత అస్సాం బయోఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్ రిఫైనరీ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 15న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటించి, కోల్‌కతాలో జరిగే 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్2025ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత బిహార్ వెళ్లి.. పూర్ణియా విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పూర్ణియాలో దాదాపు రూ.36వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

# త్వరలో భారత్‌కు ట్రంప్!



ఈకబురు, వాషింగ్టన్, : భారత్‌లో త్వరలో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉందని భారత్‌కు అమెరికా రాయబారిగా ట్రంప్ ఇటీవల నియమించిన సెర్గియో గోర్ తెలిపారు. గురువారం ఆయన సెనేట్ ఫారిన్ రిలేషన్స్ కమిటీతో మాట్లాడుతూ, ఈ సదస్సుకు హాజరవడంతో పాటు క్వాడ్ బలోపేతానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. ఆయన పర్యటనకు సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా జరిగాయని పేర్కొన్నారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ దేశాధినేతల సదస్సును భారత్ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఫిబ్రవరిలో అమెరికా పర్యటన సందర్భంగా ఈ సమావేశానికి హాజరు కావాలని ట్రంప్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. కాగా, భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడమే తమకు అత్యంత ప్రాధాన్యమని గోర్ స్పష్టం చేశారు. భారత్‌ను అమెరికాకు చేరువ చేయడంతో పాటు చైనాకు దూరం చేయడమే లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం అమెరికా, భారత్ మధ్య నెలకొన్న తాత్కాలిక అడ్డంకులు త్వరలోనే తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశానికి దశాబ్దాల నుంచి సత్సంబంధాలు ఉన్నాయని, చైనీయులతో కంటే కూడా అమెరికన్లతోనే వారికి సాన్నిహిత్యం ఎక్కువని గోర్ వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

## ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాహుల్‌గాంధీ మాట్లాడాలి



**భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్**

ఈ-కబురు హైదరాబాద్: తెలంగాణలో కొనసాగుతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. "జాతీయ స్థాయిలో 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ.. తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఎందుకు మాట్లాడడం లేదు. ఇది జాతీయ స్థాయిలో ఆయన లేవనెత్తుతున్న ఓటు చోరీ అంశం కంటే దారుణమైంది. రాజ్యాంగ విరుద్ధమైన ఈ ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరుగుతోంది. పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యే ఫొటోను మీకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఆ రోజు వారు కాంగ్రెస్ కండువా కప్పుకొని.. ఈరోజు మేము కాంగ్రెస్‌లో చేరలేదు అంటున్నారు. మీరు దీనికి ఒప్పుకొంటారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి

## 15వ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్



రాధాకృష్ణన్ తమిళ సంప్రదాయ దుస్తులు, ఎర్ర కుర్తా ధరించి వచ్చిన ఆయన.. భగవంతుడిపై ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ, పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సైతం సతీసమేతంగా హాజరవడమే గాక.. అందరినీ నవ్వుతూ పలకరించడం గమనార్హం. వెంకయ్య పక్కనే ఆసీనులయ్యారు. జూలై 21న రాజీనామా చేశాక ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే ప్రథమం. అనారోగ్య కారణాలతో ఆయన రాజీనామా చేయడం వల్లే ఈ నెల 9న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగడం, రాధాకృష్ణన్ 'ఇండీ' కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం తెలిసిందే. ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన రాధాకృష్ణన్ ఇక రాజ్యసభ చైర్మన్‌గానూ వ్యవహరించనున్నారు. 2030 సెప్టెంబరు 11 వరకు ఆయన పదవిలో కొనసాగుతారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ మాత్రమే కనిపించారు. ఖర్గేతో రాధాకృష్ణన్ కరచాలనం చేశారు. మిగతా ప్రతిపక్షాల నేతలెవరూ రాలేదు. 2022లో ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ ప్రమాణ స్వీకారానికి కూడా విపక్ష నేతలెవరూ హాజరుకాకపోవడం గమనార్హం. కాగా.. ప్రమాణస్వీకారం అనంతరం రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. సదైవ్ అటల్ (స్మారక చిహ్నం) వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ స్మారక చిహ్నం వద్ద, కిసాన్ ఘాట్ వద్ద మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. ఆ తర్వాత రాజ్యసభ చైర్మన్ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణాస్థల్ వద్ద దేశ ప్రసిద్ధ నేతలు, స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు ఆయన నివాళులు అర్పించారు.

మోదీ అభినందనలు

కొత్త ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తన పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ప్రజాజీవితం, ప్రజాస్వామ్య విలువలకు ఆయన జీవితాంతం కట్టుబడుతూ వచ్చారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సామాజిక సేవ, ప్రజాస్వామ్య విలువల బలోపేతానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.

సీపీ జీవన విశేషాలు..

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)తో సుదీర్ఘ అనుబంధం ఉన్న సీపీ రాధాకృష్ణన్ (68) తమిళనాడులోని తిరుప్పూర్‌లో 1957 మే 4న జన్మించారు. తూత్తుకుడిలోని వీవో చిదంబరం కాలేజీలో బీబీఏ చదివారు. 16ఏళ్ల వయసు నుంచే ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్‌తో అనుబంధం పెంచుకున్నారు. కోయంబత్తూరు నుంచి 1998, 99ల్లో రెండు సార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అన్నాడీఎంకే, డీఎంకేలతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నాటి ప్రధాని వాజపేయికి సన్నిహితుడు. ఏకాభిప్రాయ సాధకుడిగా పేరు సంపాదించారు. తమిళనాడు రాజకీయాల్లో 'మిస్టర్ క్లీన్' కూడా. 2003 నుంచి 2006 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషిచేశారు. 2023 ఫిబ్రవరిలో ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. తర్వాత తెలంగాణ.. నిన్నటి వరకు మహారాష్ట్ర గవర్నర్‌గానూ పనిచేశారు.

మలేసియా వెళ్లడానికి రాహుల్‌కు టైముందా?

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానికి లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ గైర్హాజరుపై బీజేపీ మండిపడింది. మలేసియా వెళ్లడానికి ఆయనకు టైముంటుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎద్దేవా చేశారు.

# బాణసంచాపై నిషేధం ఢిల్లీకే పరిమితం ఎందుకు?

**జాతీయ విధానం ఉండాలి కదా?**
**కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు**

ఈకబురు ,న్యూఢిల్లీ: బాణసంచా నిషేధం ఒక్క ఢిల్లీదేశ రాజధాని ప్రాంతానికే పరిమితం చేయడం ఎందుకని, దానిపై జాతీయ విధానం రూపొందించవచ్చు కదా అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్వచ్ఛమైన గాలి కేవలం రాజధానిలోని ఉన్నత వర్గాల వారికే పరిమితం కాకూడదని, దేశంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి కదా అని వ్యాఖ్యానించింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యే విధంగా విధానాన్ని రూపొందించడం ఏమిటని ప్రశ్నించింది. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ తాను గత శీతాకాలంలో అమృత్‌సర్‌లో ఉన్నప్పుడు అక్కడ ఢిల్లీ కన్నా అధికంగా కాలుష్యం ఉండడాన్ని గమనించానని, అక్కడ మాత్రం బాణసంచాపై నిషేధం లేదని అన్నారు. "ఒక వేళ బాణసంచాను నిషేధిస్తే దానిని దేశమంతటా నిషేధించాలి" అని చెప్పారు. దీనిపై కోర్టు సహాయకురాలిగా వ్యవహరిస్తున్న అపరాజిత సింగ్ స్పందిస్తూ కాలుష్యం ఒక్క ఉన్నత వర్గాల సమస్య అని భావించడం సరికాదని చెప్పారు. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయినా ఢిల్లీలో కాలుష్యం పెరిగినప్పుడు ఉన్నతవర్గాల వారు వేరేచోటికి వెళ్లి ఎవరి జాగ్రత్తల్లో వారు ఉంటున్నారని అన్నారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సమాధానం ఇస్తూ 'గ్రీన్ క్రాకర్స్' ద్వారా కాలుష్యాన్ని తగ్గించే విషయమై జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ (నీరి) అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఈ సమస్యపై వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ నుంచి సవివరమైన నివేదిక తెప్పించాలని ధర్మాసనం ఆమెకు సూచించింది. బాణసంచా తయారీదార్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి రసాయన మిశ్రమాలను ఉపయోగించాలో 'నీరి' సూచిస్తే దానిని తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ మాట్లాడుతూ బాణసంచా తయారీపై ఆంక్షలు విధించడంతో పాటు 2028 వరకు మంజూరు చేసిన లైసెన్సులను కూడా అధికార్లు రద్దు చేస్తున్నారని చెప్పారు. బాణసంచా వ్యాపారుల లైసెన్సుల రద్దుపై యథాతథ స్థితి కొనసాగుతుందని చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం

సుప్రీంకోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు, వీడియోలు, రీల్స్ చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీన్ని 'హై సెక్యూరిటీ జోన్'గా పరిగణించిన సుప్రీంకోర్టు.. అక్కడి లాన్‌లోకి కెమేరాలు, ట్రైపాడ్‌లు, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను తీసుకెళ్లకూడదంటూ బుధవారం సర్క్యులర్ జారీ చేసింది.

**బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లోనే నిర్ణయం**

బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. కేసులోని మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది.

**దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపును పరిశీలించండి**

ప్రతిభ చూపిన దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపు చేయడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ మార్కులు సంపాదిస్తే వారికి జనరల్ కోటాలో సీట్లు ఇస్తున్నారని, అదే విధానాన్ని దివ్యాంగులకు కూడా అమలు చేయాలని అభిప్రాయపడింది. వారికి కేవలం దివ్యాంగుల కోటాలోనే సీట్లు ఇస్తామనడం వివక్ష కిందకే వస్తుందని తెలిపింది. దీనిపై అక్టోబరు 14లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. పదోన్నతుల్లోనూ ఈ విధానాన్ని అవలంబించాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 13కు వాయిదా వేసింది.

# దక్షిణాది కుంభమేళాలా గోదావరి పుష్కరాలు



కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరేలా..

"ప్రస్తుతం ఉన్న పుష్కర ఘాట్లను విస్తరించాలి. రోడ్లు, ఇతర వసతులకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌లతోపాటు అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలి. పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

గోదావరి తీరంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి. శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలి. రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహకంలోని ఆలయాలన్నింటినీ క్షేత్రస్థాయిలో సందర్శించి.. అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను తయారు చేయాలి. మహాకుంభమేళా, వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలి. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతోపాటు గోదావరి తీరం వెంట ఉన్న ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసుకోవాలి" అని అధికారులను సీఎం ఆదేశించారు.

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి



ఈకబురు, కాఠ్మండూ,: 'జెనరేషన్ జెడ్' యువత ఆందోళనలతో అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. నేపాల్ అధ్యక్ష కార్యాలయంలో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్‌తో జెన్ జెడ్ గ్రూపుల ప్రతినిధులు శుక్రవారం జరిపిన చర్చల్లో ఈ మేరకు అంగీకారానికి వచ్చారు. అనంతరం శుక్రవారం రాత్రి 9.30గంటలకు నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ యాదవ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ప్రకాశ్‌సింగ్ రావత్, ఆర్మీ చీఫ్, ఇతర కీలక నేతలు, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత పార్లమెంటును రద్దు చేస్తున్న నేపథ్యంలో పాలన సజావుగా కొనసాగానికి వీలుగా పది మంది మంత్రులను నియమించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. మరోవైపు తాము ప్రభుత్వంలో చేరబోమని, ప్రభుత్వ పనితీరును తమ సలహా కమిటీ పర్యవేక్షించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుందని 'జెన్ జెడ్' గ్రూపుల ప్రతినిధులు స్పష్టం చేసినట్టు తెలిసింది.

సుదీర్ఘ చర్చల తర్వాత ఖరారు..

యువత ఆందోళనల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితోపాటు కాఠ్మండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సీఈవో కుల్మన్ ఘీసింగ్, మేయర్ హర్కా సంపంగ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. గురువారం ఆర్మీ ప్రధాన కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఏమీ తేలలేదు. శుక్రవారం రాత్రి వరకు దేశాధ్యక్ష కార్యాలయంలో చర్చలు జరిగాయి. చివరికి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. 73ఏళ్ల సుశీల కర్కి నేపాల్ సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తికాగా, ఇప్పుడు తొలి మహిళా ప్రధాని కూడా ఆమెనే కావడం విశేషం.

అధ్యక్షుడి విశేషాధికారాల మేరకు..

నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76 ప్రకారం.. పార్లమెంటు సభ్యుడై ఉండి, మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నవారే ప్రధానమంత్రి అవుతారు. ప్రస్తుతం నేపాల్ పార్లమెంటును రద్దు చేసిన నేపథ్యంలో ఆ దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 61 ప్రకారం అధ్యక్షుడికి దఖలు పడిన విశేషాధికారాల మేరకు తాత్కాలిక ప్రధానిగా సుశీలను నియమిస్తూ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఉత్తర్వులు జారీ చేశారు.

దేశంలో ఎమర్జెన్సీ..

తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుశీల కర్కి.. ఉన్నతాధికారులతో తొలి కేబినెట్ భేటీ నిర్వహించారు. నేపాల్‌లో ఆరు నెలల్లోగా సాధారణ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ప్రతిపాదించారు. ఇక దేశంలో అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా, దేశంలో పరిస్థితులు చక్కబడేలా తగిన చర్యలు చేపట్టేందుకు వీలుగా.. నేపాల్‌లో అత్యవసర పరిస్థితి విధించాలని అధ్యక్షుడికి తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి సిఫారసు చేసినట్టు తెలిసింది.

రాజకీయ పక్షాల నిరసనలు

నేపాల్ ప్రస్తుత పార్లమెంటును రద్దుచేయాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ.. రాజకీయ పక్షాలు శుక్రవారం ఆ దేశ అధ్యక్ష కార్యాలయం బయట ఆందోళనకు దిగాయి. ఆందోళనలతో ప్రధాని పదవికి రాజీనామా చేసిన కేపీ శర్మ ఓలికి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (సీపీఎన్‌యూఎంఎల్) ప్రధాన కార్యదర్శి శంకర్ పొఖారెల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఇక తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపిక రాజ్యాంగ విరుద్ధమని నేపాల్ మావోయిస్టు పార్టీ నేత దేవేంద్ర పౌడెల్ మండిపడ్డారు. మరోవైపు.. ఆ దేశ పార్లమెంటు దిగువ సభ స్పీకర్ దేవ్‌రాజ్ ఘిమిరే (సీపీఎన్‌యూఎంఎల్), ఎగువ సభ చైర్‌పర్సన్ నారాయణ్ దహాల్ (మావోయిస్టు పార్టీ) ఇద్దరూ కూడా సుశీల కర్కి ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. నేపాల్‌లో రాజకీయపరంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంటోందని, దానికి ఇది సూచన అని విశ్లేషకులు చెబుతున్నారు.

**51కి చేరిన మృతుల సంఖ్య..**

జనరేషన్ జెడ్ యువత ఆందోళనలు, పోలీసుల కాల్పుల ఘటనల్లో మృతుల సంఖ్య 51కి చేరింది. ఇందులో కాఠ్మండూలో ఆందోళనలు జరిగిన ప్రధాన ప్రాంతాల్లో 34 మంది మరణించగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మరో 17 మంది మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మొత్తంగా 1,700 మందికిపైగా గాయపడ్డారని, ప్రస్తుతం 700 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ప్రకటించారు. దేశవ్యాప్తంగా పోలీసేస్టేషన్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు.

'డిస్కార్డ్' యాప్‌తో తాత్కాలిక ప్రధాని ఎంపిక!

నేపాల్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టిన 'జనరేషన్ జెడ్' యువత.. తమ తరానికి తగినట్టే తాత్కాలిక ప్రధానిని ఆన్‌లైన్‌లో ఎంచుకున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడేవారికి సంబంధించి 'డిస్కార్డ్' చాటింగ్ యాప్‌ను వేదికగా చేసుకున్నారు. తాత్కాలిక ప్రధాని ఎవరైతే బాగుంటుందనే దానిపై లక్ష మందికిపైగా యువత ఈ యాప్‌లో వాడివేడి చర్చలు జరిపి, పోల్స్ నిర్వహించి.. చివరికి మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి పేరును ఖరారు చేశారు. దీనిపై సిద్ ఘిమిరి అనే కంటెంట్ క్రియేటర్ మాట్లాడుతూ.. "నేపాల్ పార్లమెంటు ప్రస్తుతం డిస్కార్డ్‌లోనే ఉంది" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ అంశాలతో న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ప్రచురించింది. నిజానికి డస్కార్డ్ చాట్ యాప్ 2015లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దీనికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇందులో ఏదైనా చానల్ సృష్టించి.. ఒకేసారి లక్షల మంది చాట్ చేయడానికి వీలుంటుంది.

భారతీయుల బస్సుపై దాడి

కాఠ్మండూలోని పశుపతినాథ్ ఆలయానికి వెళ్లి వస్తున్న తెలుగువారి బస్సుపై ఆందోళనకారులు దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. కర్ఫ్యూతో నేపాల్‌లో చిక్కుకుపోయిన ఈ బస్సు.. గురువారం రాత్రి భారత్, నేపాల్ సరిహద్దుల్లోని సనౌలి వద్దకు చేరుకున్నాక బస్సులోని సిబ్బంది శ్యామూ నిషాద్ ఈ వివరాలు వెల్లడించారు. "9న పశుపతినాథ్ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నాం. బస్సులో వృద్ధులు, మహిళలు, పిల్లలు సహా 49 మంది ఉన్నారు. మధ్యలో కొందరు ఆందోళనకారులు మా బస్సుపై రాళ్లు రువ్వారు. కిటికీల అద్దాలు పగిలి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నేపాల్ ఆర్మీ వచ్చి మాకు సాయం చేసింది" అని తెలిపారు.

హోటల్ నాలుగో అంతస్తు నుంచి దూకి..

నేపాల్ ఆందోళనల్లో భారత మహిళ ఒకరు చనిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రాజేశ్ గోలా, ఆమె భర్త రామ్‌వీర్ సింగ్ గోలా కలిసి ఈ నెల 7న నేపాల్ పర్యటనకు వెళ్లారు. కాఠ్మండూలోని హయత్ రెసిడెన్సీ హోటల్‌లో బస చేశారు. ఈ నెల 9న ఆందోళనకారులు ఆ హోటల్‌కు నిప్పు పెట్టారు. సహాయక బృందాలు అక్కడికి చేరుకుని హోటల్‌లో చిక్కుకున్నవారిని కాపాడే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో హోటల్ నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకిన రాజేశ్ గోలాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె భర్తకూడా గాయపడినా ప్రాణాలతో బయటపడ్డారు.

**హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం**

జనరేషన్ జెడ్ ఆందోళనలు, అనంతర పరిస్థితులతో నేపాల్‌లోని హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం వాటిల్లినట్టు హోటల్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ (హాన్) అంచనా వేసింది. చాలా హోటళ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయని.. కాఠ్మండూలోని ప్రముఖ హిల్టన్ హోటల్‌ను ఆందోళనకారులు తగలబెట్టడంతోనే రూ.800 కోట్ల నష్టం కలిగిందని పేర్కొంది.

# సైదాపూర్‌లో భారీ వర్షం.. వసతి గృహం చుట్టూ చేరిన వరదనీరు



ఈ-కబురు, సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. న్యాళ చెరువు, ఆకునూరు ఊర చెరువు సహా పలు కుంటలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. సోమారంలో ఆదర్శ పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. అక్కడి వసతి గృహం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొమ్మకల్ వద్ద కల్వర్టుపై వరద ఉద్ధృతి అధికంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెనుకేపల్లి తుమ్మలచెరువు మత్తడి పడుతుండడంతో అటువైపు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షా లు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రాత్రి సైదాపూర్‌లో 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



# రాయదుర్గంలో 11 టన్నుల రేషన్ బియ్యం సీజ్

ఈ-కబురు, శేరిలింగంపల్లి : ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఓ వాహనాన్ని రాయదుర్గంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాల్లో విక్రయించడం కోసం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న డిసిఎం వాహనాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు 11 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇనిస్పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రాయదుర్గం పోలీసులు మాదాపూర్ ఐకియా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా కనిపించిన డిసిఎం (టిఎస్12 యుసి0179) ను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, తప్పించుకునేందుకు డ్రైవర్ ముందుకు వరుగులు పెట్టించాడు. దీంతో డిసిఎంను వెంబడించిన పోలీసులు డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని వాహనం లోపల తనిఖీ చేశారు. డిసిఎం వాహనంలో 11 టన్నుల రేషన్ బియ్యం గుర్తించారు. డిసీఎం డ్రైవర్ ను విచారించగా తనపేరు మహ్మద్ యూసుఫ్ అని వెల్లడించాడు. మహ్మద్ అనే వ్యక్తి నగరంలోని రేషన్ లబ్దిదారుల వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, డిసిఎం వ్యాన్ యజమాని అశోక్ తో కలిసి రాష్ట్రం దాటించేందుకు పథకం వేశాడని తెలిపాడు. లబ్దిదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు రవాణా చేస్తున్నట్లు వెల్లడించాడు. దీంతో రాయదుర్గం పోలీసులు డిసిఎం డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని, అందులో ఉన్న 11 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు సీజ్ చేసిన రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న డిసిఎం

# భారీ వర్షా లతో కామారెడ్డి సభ వాయిదా



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

ఈ-కబురు, హైదరాబాద్: ప్రతికూల వాతావరణం, భారీ వర్షా లు కురిసే అవకాశాలున్నాయనే సమాచారంతో ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించాలనుకున్న 'బీసీ డిక్లరేషన్' సభను వాయిదా వేసినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనే తేదీని రెండుమూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు, అసెంబ్లీలో బిల్లుల ఆమోదానికి చేసిన కృషిని వివరించేందుకే ఈ సభను నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమాచారాన్ని ఇంటింటికీ వెళ్లి చెప్పి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలందరికీ సూచనలు ఇచ్చినట్లు వివరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసిన బీసీ డిక్లరేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# వంద రోజుల్లో మేడారం ఆధునికీకరణ: పొంగులేటి

**వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు**

ఈకబురు, హైదరాబాద్: ఆసియా ఖండంలోనే ప్రసిద్ధిగాంచిన సమ్మక్క సారలమ్మ దేవాలయ ఆధునికీకరణ పనులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... "రానున్న వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారి మనోభావాలకు అనుగుణంగా ఈ పనులు చేపడుతున్నాం. ఎక్కువ మంది జనం పట్టేలా... గద్దెల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. వాటి చుట్టూ 48 అడుగల ఎత్తులో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా తోరణాలు (ఆర్చ్‌లు) నిర్మించాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం ఆలయాల మాస్టర్ ప్లాన్‌ను ఇప్పటికే పరిశీలించారు. వచ్చే వారం సీఎం స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. తగిన ప్రణాళికలు, సమాచారంతో యంత్రాంగం సిద్ధంగా ఉండాలి" అని ఆదేశించారు. సమీక్షలో ఎంపీ బలరామ్‌నాయక్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొ



# ఇక బొగ్గు గనుల వేలంలో సింగరేణి




సింగరేణిని బతికించుకోవడానికి మార్గం కనిపెట్టండి

సింగరేణిని బతికించుకోవడానికి మార్గం కనిపెట్టాలని, కార్మికులకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిని బతికించుకోకపోతే భవిష్యత్తు తరాలకు ఏమీఇవ్వలేం అని, పది కాలాల పాటు కాపాడుకునేందుకు ఏం చేయాలో కార్మిక సంఘాలు ఆలోచించి చెప్పాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో సింగరేణి కార్మిక సంఘాలతో భట్టి మాట్లాడారు. "మారిన ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో ఎక్కడ తక్కువ ధరకు బొగ్గు లభిస్తే అక్కడ కొనుక్కునే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు అమ్ముడుపోక మిగిలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అన్ని సంఘాలు సమావేశమై సింగరేణి భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకోవాలి. కార్మికులకు రోజులో సగం పూట సెలవు ప్రకటించి భోజనం పెట్టి వాస్తవాలను వివరించాలి" అని కోరారు.

పన్నుల వసూళ్లపై పర్యవేక్షణ పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను అందుకోవాలని, పన్నుల వసూళ్లపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను అందుకునేందుకు వాణిజ్య పన్నులశాఖ కృషి చేయాలన్నారు. శుక్రవారం సచివాలయంలో వాణిజ్య పన్నులశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. "ఆదాయం తగ్గుతున్న ప్రాంతాలను గుర్తించాలని, సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి పరిశీలించాలి. ఇకనుంచి 15 రోజులకోసారి శాఖ ప్రగతిపై సమీక్ష చేపడతా. జీఎస్టీ ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలి. నిఘా వ్యవస్థను పక్కాగా ఏర్పాటు చేసుకోవాలి. ఆదాయం పెంపునకు అవసరమైన సంస్కరణలను అధ్యయనం చేసేందుకు శాఖలో అంతర్గతంగా కమిటీలు వేసి నివేదిక ఇవ్వాలి" అని భట్టి సూచించారు.

# ఆర్‌ఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్ మార్చాలిగృహం చుట్టూ చేరిన వరదనీరు

ఈకబురు, హైదరాబాద్: చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ డివిజన్ పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ ఎలైన్‌మెంట్‌ను ఓఆర్‌ఆర్ నుంచి 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లకు కుదించడాన్ని నిరసిస్తూ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. దీనికి అఖిలపక్ష నాయకులు మద్దతు తెలిపారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ప్రసంగించి ఎలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భూనిర్వాసితులు కోల్పోయే భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయించి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. భూనిర్వాసిత ఐక్య వేదిక కన్వీనర్ దామోదర్‌రెడ్డితో కలిసి ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బస్‌స్టేషన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడానికి భూనిర్వాసితులు సిద్ధమవగా పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసులు అడ్డుకుంటున్నా రైతులు జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ బైఠాయించి వాహనాల రాకపోకలు స్తంభింపజేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు చివరికి ఆందోళనకారులు కొందరిని అదుపులోకి తీసుకుని తర్వాత వదిలేశారు. సుమారు గంటసేపు జాతీయ రహదారిపై ఉద్రిక్తత నెలకొంది.



# లోక్‌సభలోనే వారసులెక్కువ!

ఈ-కబురు, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా శాసనసభల్లోకన్నా లోక్‌సభలోనే వారసుల సంఖ్య అధికంగా ఉందని, దేశంలో వారసత్వ రాజకీయాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. 543 మంది లోక్‌సభ ఎంపీల్లో 167 మందికి.. అంటే, 31 శాతం మందికి వారసత్వ నేపథ్యం ఉండగా, 224 మంది రాజ్యసభ ఎంపీల్లో 47 మందికి (21 శాతం) వారసత్వ నేపథ్యం ఉన్నదని వెల్లడించింది. ఈ మేరకు ఏడీఆర్ శుక్రవారం ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో 20٪ మంది ఎమ్మెల్యేలకు, శాసనమండలిల్లో 22٪ మంది ఎమ్మెల్సీలకు కుటుంబ వారసత్వం ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా వారసులు ఉన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన 604 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 141 మంది వారసులే. యూపీ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (129 మంది), బిహార్ (96 మంది), కర్ణాటక (94 మంది) ఉన్నాయి. వారసుల విషయంలో తెలంగాణ 9వస్థానంలో ఉంది. తెలంగాణలో 176 మంది చట్టసభల సభ్యుల్లో 43 మంది (24٪) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చారు. 11 మంది ఎంపీలు వారసత్వ నేపథ్యం నుంచే వచ్చారు. వారిలో గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, జీ నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, ఆర్ రఘురాం రెడ్డి, మల్లు రవి, కె రఘువీర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, కడియం కావ్య ఉన్నారు. ఈ జాబితాలో ఐదవ స్థానంలో ఉన్న ఏపీలో మొత్తం 255 మంది చట్టసభల సభ్యులు ఉండగా.. వారిలో 86 మంది (34٪) వారసులేనని ఏడీఆర్ తేల్చింది. ఏపీకి చెందిన లోక్‌సభ ఎంపీల్లో ఎనిమిది మందికి రాజకీయ వారసత్వం ఉంది. వారిలో జీఎం హరీశ్, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, పుట్టా మహేష్ కుమార్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, దగ్గుబాటి పురంధేశ్వరి ఉన్నారు. కాగా, దేశవ్యాప్తంగా చట్టసభల సభ్యుల్లో వారసత్వ నేపథ్యం నుంచి వచ్చిన వారిలో మహిళలే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం 4,665 మంది పురుష ప్రజాప్రతినిధుల్లో 856 మందికి (18٪) వారసత్వ నేపథ్యం ఉంటే, 539 మంది మహిళా ప్రజాప్రతినిధుల్లో 251 మంది (47٪) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన స్త్రీలు ఉన్నారని, వీరిలో అత్యధిక శాతం అంటే 69٪ మంది మహిళలు మహారాష్ట్రలో ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ప్రజాప్రతినిధుల్లో 69 శాతం మహిళలు వారసులు అయితే, పురుషుల్లో 29٪ మంది మాత్రమే వారసత్వ నేపథ్యం ఉన్నవారు. తెలంగాణలో 64٪ మంది మహిళలు, 21٪ మంది పురుషులు వారసులేనని ఏడీఆర్ పేర్కొంది.

**కాంగ్రెస్‌లో అత్యధికం**

పార్టీల వారీగా చూస్తే.. కాంగ్రెస్‌లోనే అత్యధికంగా రాజకీయ వారసులు ఉన్నారు. జాతీయ పార్టీల్లోని మొత్తం 3,214 మంది ప్రజాప్రతినిధుల్లో కాంగ్రెస్‌లో 32٪, బీజేపీలో 18٪ మంది వారసత్వ నేపథ్యం నుంచి వచ్చినవారని ఏడీఆర్ వెల్లడించింది. ప్రాంతీయ పార్టీల్లోని 1809 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధుల్లో 406 మందికి వారసత్వ నేపథ్యం ఉంది. వైఎస్సార్‌సీపీలో 38 శాతం మంది, తెలుగుదేశంలో 36 శాతం మంది వారసులే. బీఆర్ఎస్‌లోని 52 మంది ప్రజాప్రతినిధుల్లో 10 మందికి వారసత్వ నేపథ్యం ఉన్నదని ఏడీఆర్ పేర్కొంది.



## దేశీయంగా క్లౌడ్ వ్యవస్థ అభివృద్ధి




దిల్లీ: దేశీయంగా సొంత క్లౌడ్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వెల్లడించింది. భారతదేశ డేటా స్థానికంగానే నిల్వ ఉంచాలన్న నిబంధనలకు అనుగుణంగా, స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడనుంది. కీలకమైన ప్రభుత్వ సేవల డిజిటలీకరణకు మద్దతు ఇచ్చేందుకు, ఏఐ-సామర్థ్యం ఉన్న క్లౌడ్ వేదికలను అందించేందుకు తమ భాగస్వామ్యం దృష్టి సారిస్తుందని టీసీఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. 'ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పరిశోధన, అభివృద్ధి సంస్థ సీ-డాక్‌తో కలిసి, టీసీఎస్ స్వతంత్ర క్లౌడ్ స్టాక్‌లో స్వదేశీ ఆవిష్కరణలను అభివృద్ధి చేస్తుంది' అని పేర్కొంది. దీనిద్వారా ఇ-సంజీవని, డయల్ 112, కేంద్ర మంత్రిత్వ శాఖల కీలక అప్లికేషన్‌లను సురక్షితంగా, నిబంధనలకు అనుగుణంగా ఉంచడంపైనా పనిచేస్తారు. ఆరోగ్య, రక్షణ, స్మార్ట్ సిటీలు, బీఎఫ్ఎస్ఐ వంటి కీలక రంగాల్లో భద్రత, నిబంధనలకు అనుగుణంగా, పనితీరును మెరుగుపర్చేందుకు సంస్థలకు తోడ్పడతామని వివరించింది.

## పన్ను రిఫండ్ ఇంకా రాలేదా? కారణం ఇదే అయ్యుండొచ్చు!

ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుకు గడువు సమీపిస్తోంది. మరో మూడు రోజుల్లో డెడ్‌లైన్ ముగియనుంది. ఇప్పటికీ రిటర్నులు దాఖలు చేయని వారు వీలైనంత తొందరగా రిటర్నులు దాఖలు చేయాలని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రిటర్నులు దాఖలు చేసిన వారు.. రిఫండ్ కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని గంటల్లోనే కొందరు రిఫండ్ అందుకున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడతుండగా.. మరికొందరు మాత్రం వారాలు గడుస్తున్నా తమకు రిఫండ్ రాలేదని వాపోతున్నారు. రిఫండ్ స్టేటస్ ఇంకా 'అండర్ ప్రాసెస్' అనే చూపిస్తోందంటూ మండిపడుతున్నారు. ఇంతకీ స్టేటస్ ఎలా చెక్ చేయాలి? రిఫండ్ ఆలస్యానికి ఆదాయపు పన్ను శాఖ చెబుతున్న కారణాలేంటి?
ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడంతో పాటు ఇవెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆదాయపు పన్ను విభాగం రిటర్నులను ప్రాసెస్ చేస్తుంది. సాధారణంగా రిఫండ్ జారీకి 2 నుంచి 5 వారాల్లో బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది. అన్నీ సక్రమంగా ఉంటే రోజుల వ్యవధిలోనే రిఫండ్ జమ అవుతుంది.
గడువులోగా రిటర్నులు దాఖలు చేయకపోతే?
ఎలా చెక్ చేయాలి?
పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి పాన్, పాస్‌వర్డ్ వివరాలతో లాగిన్ అవ్వాలి.
టాప్ మెనూలో ఇఫైలింగ్ విభాగంలోకి వెళితే.. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్>వ్యూ ఫైల్డ్ రిటర్న్స్‌లోకి వెళితే రిఫండ్ స్టేటస్ కనిపిస్తుంది.
అక్కడ అసెస్‌మెంట్ ఇయర్ వారీగా రిఫండ్ స్టేటస్ దర్శనమిస్తుంది.
రిటర్నులు ఎప్పుడు సబ్మిట్ చేశారు? ఇవెరికేషన్ ఎప్పుడు చేశారు? ప్రాసెస్‌కు ఎన్ని రోజుల గడువు పట్టింది? రిఫండ్ ఎప్పుడు జారీ చేశారు వంటి వివరాలు అక్కడ కనిపిస్తాయి.
ఆలస్యానికి కారణాలు ఇవే..
ఆదాయపు పన్ను రిటర్నులు ఆలస్యం కావడానికి వివిధ కారణాలు ఉంటాయని ఆదాయపు పన్ను విభాగం చెబుతోంది.
బ్యాంక్ అకౌంట్ ప్రీ వ్యాలిడేట్ చేయకపోవడం కారణంగా రిటర్నులు ఆలస్యం అవ్వొచ్చు. ఒకసారి మీ బ్యాంక్ వ్యాలిడేట్ చేసుందా లేదా చెక్ చేయండి.
బ్యాంక్ ఖాతాలోని పేరు, పాన్ వివరాలతో సరిపోలని సందర్భంలోనూ రిఫండ్ జారీ అవ్వకపోవచ్చు.
ఐటీఆర్‌లో పొందుపరిచిన బ్యాంక్ అకౌంట్ మూసివేయడం లేదా బ్యాంక్ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పున్న సందర్భాల్లోనూ రిఫండ్ రాదు.
పాన్‌తో ఆధార్ అనుసంధానం కాని సందర్భంలోనూ రిఫండ్ మీకు రాకపోవచ్చు. అదే జరిగి ఉంటే ఎర్రర్ మెసేజ్ వస్తుంది. పాన్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచిస్తుంది.
గడువులోగా ఐటీఆర్ దాఖలు చేసినప్పటికీ ఐటీఆర్ దాఖలు చేసిన 30 రోజుల్లోగా ఇవెరిఫికేషన్ పూర్తి చేయాలి. అప్పుడే రిఫండ్ అందుతుంది.
సాధారణంగా పెద్ద మొత్తంలో రిఫండ్ జారీ చేసే సమయంలో ఆదాయపు పన్ను విభాగం మరిన్ని ఎక్కువ తనిఖీలు చేస్తుంది. కొన్నిసార్లు ఈ కారణంగానూ రిఫండ్ జారీ ఆలస్యం కావొచ్చు.




## మొదలైన ఐఫోన్ 17 బుకింగ్స్: ఎక్కడ, ఎలా ఆర్డర్ చేయాలంటే..



ఈ వారం ప్రారంభంలో యాపిల్ తన ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ చేసింది. కంపెనీ ఈ లేటెస్ట్ ఫోన్స్ కోసం ప్రీబుకింగ్‌లను భారతదేశంలో శుక్రవారం (సెప్టెంబర్ 12) సాయంత్రం 5:30 గంటల నుంచి ప్రారంభించింది. ఆపిల్ ఆన్‌లైన్ స్టోర్ లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా దీనిని బుక్ చేసుకోవచ్చు. అమ్మకాలు సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభమవుతాయి. ఆ రోజు మీరు ఐఫోన్ డెలివరీ పొందవచ్చు లేదా మీ నగరంలోని ఆపిల్ స్టోర్ నుంచి కూడా తీసుకోవచ్చు.

ఐఫోన్ 17 ప్రీబుకింగ్స్..ఎలా ఆర్డర్ చేయాలంటే..
యాపిల్ వెబ్‌సైట్ ఓపెన్ చేయండి.
హోమ్ పేజీలోని మీ ఐఫోన్ 17 మోడల్‌ను ఎంచుకోండి.
మీరు బుక్ చేయాలనుకుంటున్న వేరియంట్, కలర్, స్టోరేజ్ వంటి వాటిని సెలక్ట్ చేసుకొండి.
బుకింగ్స్ పూర్తి చేయడానికి కార్ట్‌కు జోడించి, చెక్‌అవుట్ మీద క్లిక్ చేయండి.
ఆ తరువాత కార్డ్, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. లేదా ఈఎంఐ ఆప్షన్ ఎంచుకోవచ్చు.
ఇవన్నీ పూర్తయిన తరువాత బుకింగ్ పూర్తవుతుంది. ఆ తరువాత కంపెనీ డెలివరీ టైమ్‌లైన్‌ను షేర్ చేస్తుంది.

ఐఫోన్ 17 ధరలు
ఐఫోన్ 17
ఐఫోన్ 17 256జీబీ: రూ. 82,900
ఐఫోన్ 17 512జీబీ: రూ.1,02,900

ఐఫోన్ 17 ప్రో & 17 ప్రో మాక్స్
ఐఫోన్ 17 ప్రో 256జీబీ: రూ.1,34,900
ఐఫోన్ 17 ప్రో 512జీబీ: రూ.1,54,900
ఐఫోన్ 17 ప్రో 1టీబీ: రూ.1,74,900
ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 256జీబీ: రూ.1,49,900
ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 512జీబీ: రూ.1,69,900
ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 1టీబీ: రూ.1,89,900
ఐఫోన్ 17 ప్రో మాక్స్ 2టీబీ: రూ. 2,29,900

ఐఫోన్ 17 ఎయిర్
ఐఫోన్ 17 ఎయిర్ 256జీబీ: రూ.1,19,900
ఐఫోన్ 17 ఎయిర్ 512జీబీ: రూ.1,39,900
ఐఫోన్ 17 ఎయిర్ 1టీబీ: రూ.1,59,900

## 6 నెలల్లో వెండికీ తప్పనిసరి హాల్‌మార్కింగ్!



వెండి వస్తువులు, ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేయడాన్ని 6 నెలల్లో శ్రీకారం చుట్టే అవకాశం ఉందని భారతీయ ప్రమాణా మండలి (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ తెలిపారు. ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చిన 'వెండి హాల్‌మార్కింగ్' ఐచ్ఛిక అమలు ప్రక్రియ ఎలా ఉందో, ఎలాంటి ప్రభావం చూపుతుందో పరిశీలించాక.. ఏం చేయాలన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుందని వివరించారు. వెండి ఆభరణాల్లో వెండి స్వచ్ఛత ఎలా ఉందీ నిర్ధారించుకునేందుకు, డిజిటల్‌గా ఆయా ధ్రువీకరణలు పరిశీలించుకునే వీలు ఇందువల్ల వినియోగదారులకు కలిగింది. 'ప్రస్తుత ఐచ్ఛిక ప్రక్రియ అమలు తీరును పరిశీలించేందుకు 6 నెలలు సరిపోతుంది. అప్పుడు హాల్‌మార్కింగును తప్పనిసరి చేయాలా, వద్దా అన్నది నిర్ణయిస్తాం' అని పేర్కొన్నారు.
సవాళ్లున్నాయ్: ప్రస్తుతం బంగారు ఆభరణాలకు హాల్‌మార్కింగ్ ప్రక్రియ తప్పనిసరి. వెండి ధర కూడా పెరుగుతున్న నేపథ్యంలో, వినియోగదారులు చెల్లించిన నగదుకు తగిన స్వచ్ఛత ఆయా ఆభరణాలు, వస్తువుల్లో ఉందా అనేది నిర్ధారించుకునేందుకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలనే డిమాండ్ వస్తోంది. వెండిని కరిగించి, చిన్నపాటి ఆభరణాలు తక్కువ విలువలో చేస్తుంటారని.. వీటికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ పత్రాలు అందించడం కొంత సవాలేనని ప్రమోద్ అంగీకరించారు.
వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగును 800, 835, 925,958, 970, 990, 999 స్వచ్ఛతా ప్రమాణాలతో ఇస్తారు. ప్రతి ఆభరణానికి హెచ్‌యూఐడీ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఉంటుంది.
విద్యుత్తు వాహనాలకు..: 'ఈవీ (విద్యుత్తు వాహనాల) ఛార్జింగ్ స్టేషన్లకు, బ్యాటరీ స్వాపింగుకు ప్రమాణాల ముసాయిదా రూపొందించామన్నారు. ఇవి అమల్లోకి వస్తే, ఈవీల వినియోగం మరింత అధికమవుతుంద'ని పేర్కొన్నారు.

## రూ.2.25 లక్షల బెనిఫిట్: కొరియా బ్రాండ్ బంపరాఫర్



కియా ఇండియా.. ఎంపిక చేసిన మోడళ్లపై రూ.2.25 లక్షల వరకు ప్రీ-జీఎస్‌టీ & పండుగ ప్రయోజనాలను కలిపి అందించే ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ 2025 సెప్టెంబర్ 22 వరకు చెల్లుతుంది.
ఈ ఆఫర్‌లో రూ.58,000 వరకు ప్రీ-జీఎస్‌టీ సేవింగ్స్ & రూ.1.67 లక్షల వరకు ఫెస్టివల్ బెనిఫిట్స్ అందుబాటులో ఉన్నాయి. కంపెనీ ఇప్పుడు సెల్టోస్, కారెన్స్ క్లావిస్, కారెన్స్ వంటి ప్రసిద్ధ మోడళ్లపై డిస్కౌంట్స్ ప్రకటించింది. ఆఫర్ అనేది ప్రాంతాన్ని బట్టి మారే అవకాశం ఉంది.
ఈ సందర్భంగా, కియా ఇండియా సీఎస్ఓ జూన్సు చో మాట్లాడుతూ.. పండుగల సమయంలో మా కస్టమర్లకు మరింత ప్రత్యేకంగా చేయాలనుకుంటున్నాము. ప్రత్యేకమైన ప్రీ-జీఎస్‌టీ సేవింగ్స్ & పండుగ ప్రయోజనాలతో, కస్టమర్‌లు ఇప్పుడు తమకు ఇష్టమైన కియాను ఇంటికి తీసుకెళ్లవచ్చు. కియాను సొంతం చేసుకోవడం అంటే కేవలం కారు నడపడం మాత్రమే కాదు, రోజువారీ జీవితానికి సౌకర్యం, ఆనందాన్ని జోడించడం అని మేము విశ్వసిస్తున్నామని ఆయన అన్నారు.

## కొనసాగిన లాభాల జోరు



ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.130 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1556 కోట్లు
సమీక్ష
అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీకి అనుగుణంగా శుక్రవారం దేశీయ సూచీలు పరుగులు తీశాయి. వచ్చే వారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత విధించొచ్చన్న అంచనాలు ఇందుకు అండగా నిలిచాయి. అమెరికా భారత్ వాణిజ్య చర్చలపై సానుకూల అంచనాలు కూడా కలిసొచ్చాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 9 పైసలు కోలుకుని 88.26 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.47% లాభంతో 66.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.
బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.1.54 లక్షల కోట్లు పెరిగి రూ.458.72 లక్షల కోట్లు (5.20 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.
సెన్సెక్స్ ఉదయం 210 పాయింట్ల (క్రితం ముగింపు 81,548.73) లాభంతో 81,758.95 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 81,992.85 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్లు పెరిగి 25,114 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,038.05 25,139.45 పాయింట్ల మధ్య కదలాడింది.
సెన్సెక్స్ 30 షేర్లలో 18 పెరిగాయి. బీఈఎల్ 3.67%, బజాజ్ ఫైనాన్స్ 3.41%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.38%, యాక్సిస్ బ్యాంక్ 1.64%, మారుతీ 1.51%, టాటా మోటార్స్ 1.30%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.13%, ఎల్ అండ్‌టీ 1.08% లాభపడ్డాయి. ఎటెర్నల్ 2.01%, హెచ్‌యూఎల్ 1.43%, ట్రెంట్ 0.79%, టైటన్ 0.61% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. యంత్ర పరికరాలు 1.76%, పరిశ్రమలు 1.28%, టెలికాం 0.88%, యుటిలిటీస్ 0.53% రాణించాయి. బీఎస్ఈలో 2061 షేర్లు లాభపడగా, 2082 స్క్రిప్‌లు నష్టపోయాయి.
ఇన్ఫీకి లాభమే
రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్‌కు బోర్డు ఆమోదం తెలపడంతో ఇన్ఫోసిస్ షేరు 1.06% లాభపడి రూ.1,525.55 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,685.85 కోట్లు పెరిగి రూ.6.33 లక్షల కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్‌కు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (సెక్) ఉపశమనం ఇచ్చిందని కంపెనీ వెల్లడించింది.
ఎయిరిండియా నుంచి 5 లీజు విమానాలు వెనక్కు
అమెరికా సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ నుంచి లీజుకు తీసుకున్న 5 బోయింగ్ 777200 ఎల్ఆర్ విమానాలను ఎయిరిండియా వచ్చే ఏడాది మార్చికల్లా వెనక్కి ఇవ్వనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ అయిదు విమానాల్లో రెండింటిని ఇప్పటికే నిర్వహణ పనుల కోసం పక్కన పెట్టారని సమాచారం.
ఐపీఓ సమాచారం
అర్బన్ కంపెనీ ఐపీఓ చివరి రోజుకు 103.63 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 10.67 కోట్ల షేర్లను జారీ చేయనుండగా, 1106 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 140.20 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 74.04 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 39.25 రెట్ల స్పందన లభించింది.
శ్రింగార్ హౌజ్ ఆఫ్ మంగళ్‌సూత్ర ఐపీఓ చివరి రోజుకు 60.29 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 1,70,16,000 షేర్లను ఆఫర్ చేయగా, 1,02,59,15,670 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి. క్యూఐబీ విభాగంలో 101.41 రెట్లు, ఎన్ఐఐల నుంచి 82.58 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 27.22 రెట్ల స్పందన వచ్చింది.
దేవ్ యాక్సెలరేటర్ ఐపీఓ చివరిరోజుకు 63.97 రెట్ల స్పందన కనిపించింది. ఇష్యూలో భాగంగా 1,31,47,075 షేర్లను ఆఫర్ చేయగా, 84,10,19,175 షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటెయిల్ విభాగంలో 164.72 రెట్లు, ఎన్ఐఐల నుంచి 87.97 రెట్లు, క్యూఐబీ విభాగంలో 20.30 రెట్ల స్పందన లభించింది.

## భవిష్యత్ భారత్‌దే..!

స్థిరమైన విధానాలతో తయారీ హబ్‌గా ఎదగొచ్చు
పరిశ్రమకు బాసటగా ప్రభుత్వం
మారుతీ సుజుకీ ఎండీ తకేయూచి

న్యూఢిల్లీ: బలమైన ఆర్థిక శక్తిగా భవిష్యత్తంతా భారత్‌దేనని ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి తకెయూచి తెలిపారు. రాబోయే అనేక దశాబ్దాల పాటు భారత్ హవా నడుస్తుందన్నారు. దేశం ఆకాంక్షిస్తున్నట్లుగా ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగాలంటే విధానాలపరంగా స్థిరత్వం అవసరమని చెప్పారు. ఆటోమోటివ్ విడిభాగాల తయారీ సంస్థల సంఘం ఏసీఎంఏ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా తకెయూచి ఈ విషయాలు తెలిపారు.
అంతర్జాతీయంగా భౌగోళికరాజకీయ, ఆర్థిక సంక్షోభ పరిస్థితులు నెలకొన్న తరుణంలో విశ్వసనీయమైన తయారీ హబ్‌గా తన స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు భారత్ ముందు చక్కని అవకాశం ఉందని చెప్పారు. 'చరిత్రను చూస్తే ప్రతి కొన్ని దశాబ్దాలకు ఓ కొత్త దేశం ఆర్థిక శక్తిగా ఆవిర్భవించడం కనిపిస్తుంది. అమెరికా, జపాన్, హాంకాంగ్ మొదలైన వాటిని చూశాం. గత మూడు దశాబ్దాల కాలం చైనాకి చెందింది. ఆ దేశం ప్రపంచానికే ఫ్యాక్టరీగా ఎదిగింది.
ఇకపై వచ్చే అనేక దశాబ్దాల పాటు భారత్ హవా ఉంటుంది' అని ఆయన తెలిపారు. ఉద్యోగం చేయగలిగే వయస్సున్న జనాభా అత్యధికంగా ఉండటం, వేగంగా వృద్ధి చెందుతున్న నాలుగు లక్షల కోట్ల డాలర్ల ఎకానమీ, క్రియాశీలకమైన ప్రభుత్వ మద్దతు, కొత్త ఆవిష్కరణలు చేయడంపై ప్రజల్లో అమితాసక్తి తదితర అంశాలు భారత్‌కి సానుకూలమైనవని తకెయూచి చెప్పారు.
జపాన్ తరహాలోనే ఇక్కడ కూడా..
రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు జపాన్ ఏ విధంగానైతే పరిశ్రమలకు బాసటగా నిల్చిందో భారత్‌లోను అదే తరహా పరిస్థితి కనిపిస్తోందని తకెయూచి చెప్పారు.
'ప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించింది, పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం), మేకిన్ ఇండియా లాంటి సాహసోపేత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల ప్రత్యక్ష పరోక్ష పన్నులను తగ్గించడంతో పాటు దేశీయంగా డిమాండ్‌కి ఊతమిచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించడం లాంటి చర్యలన్నీ కూడా అంతిమంగా తయారీ రంగ వృద్ధికి దోహదపడతాయి' అని ఆయన పేర్కొన్నారు. ఇవన్నీ కూడా పరిశ్రమ పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను సూచిస్తాయని చెప్పారు.
టారిఫ్‌లు పెద్ద సవాలే..
భారత ఎగుమతులపై అమెరికా భారీ టారిఫ్‌లు విధించడమనేది ఆటో విడిభాగాల పరిశ్రమకు పెద్ద సవాలేనని తకెయూచి అభిప్రాయపడ్డారు. అయితే, దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున సానుకూల ఫలితాలు రాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇరు దేశాలు కొన్ని సానుకూల ప్రకటనలు చేసినట్లు తెలిపారు. భారత ఆర్థిక వృద్ధితో పాటు దేశ ఆటో పరిశ్రమ భవిష్యత్తు కూడా మరింత ఆశావహంగా కనిపిస్తోందన్నారు.
2024-25లో 523 బిలియన్ డాలర్ల మార్కును దాటిన ఆటో విడిభాగాల ఎగుమతులు 2030 నాటికి రెట్టింపు కాగలవని తకెయూచి చెప్పారు. 'అంతర్జాతీయ తయారీ హబ్‌గా భారత్ ఎదుగుతున్న విషయాన్ని ప్రపంచం గమనిస్తోంది. అందుకే తమ తొలి గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహనం ఈ-విటారా తయారీ కోసం సుజుకీ మోటార్ కార్పొరేషన్ ఈ దేశాన్ని ఎంచుకుంది. ఈ వాహనం 100 దేశాలకు ఎగుమతి అవుతుంది' అని పేర్కొన్నారు.



# అందుకే సామాజిక మాధ్యమాలకు దూరం



సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు అగ్ర కథానాయిక అనుష్క. ఆ విషయాన్ని స్వయంగా రాసిన ఓ లేఖని పోస్ట్ చేస్తూ చుకున్నారు. తిరిగి వాస్తవ ప్రపంచంతో కనెక్ట్ కావడంలో భాగంగానే ఈ దూరం అంటూ అందులో పేర్కొన్నారు.
సాధారణంగా సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే కథానాయికలే ఎక్కువ. అభిమానులకు దగ్గరగా ఉండటానికి ఆ వేదికల్ని వినియోగిస్తుంటారు.
వృత్తిపరమైన విషయాల్ని, అప్పడప్పడూ వ్యక్తిగత విషయాల్ని అక్కడ పంచుకుంటూ ఉంటారు. అనుష్క మాత్రం మొదట్నుంచీ డిజిటల్ ప్రపంచంలో అరుదుగా సందడి చేస్తుంటారు. ఈమధ్యే తన 'ఘాటి' సినిమా ప్రచారం కోసం ఆమె ఈ వేదికల్ని వినియోగించుకున్నారు. ఇప్పడు మళ్లీ ఆమె తనదైన ప్రపంచంలోకి వెళ్లడం కోసం సోషల్ మీడియాకి విరామం ప్రకటించారు. ప్రయాణాల్నీ, పుస్తక పఠనాన్నీ అమితంగా ఇష్టపడే అనుష్క... ఖాళీ సమయాన్ని కొత్త విషయాల్ని నేర్చుకోవడానికి వినియోగిస్తుంటానని చెప్పకొచ్చారు.

# దసరాకి ప్రారంభం!



వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలిసి మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ చిత్రాన్ని వెంకట సతీశ్ కిలారు నిర్మించనున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని దసరా పండగ సందర్భంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. చరిత్రను.. భారీ యాక్షన్‌ను ముడిపెట్టి ఓ వినూత్నమైన ఎపిక్ స్టోరీతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు.. బాలయ్య ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నట్లు చిత్ర బృందం ఇది వరకు ప్రకటించింది. బాలయ్య ప్రస్తుతం ఈ సినిమాతో పాటు దర్శకుడు క్రిష్ జాగర్లమూడితోనూ ఓ చిత్రం చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనిపైనా విజయదశమికి స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ప్రాజెక్ట్‌లు సమాంతరంగా చిత్రీకరణ చేసుకోనున్నట్లు తెలుస్తోంది.

# స్టంట్ స్టార్ట్



మల్‌హాసన్ కొత్త చిత్రం ప్రారంభమైంది. కమల్‌హాసన్ కెరీర్‌లోని ఈ 237వ సినిమాతో 'కేజీఎఫ్, ఖైదీ, అమరన్, కల్కి 2898 ఏడీ' వంటి సూపర్‌హిట్ సినిమాలకు పని చేసిన స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్బు-అరివు ద్వయం దర్శకులుగా పరిచయం అవుతున్నారు. 2024 ప్రారంభంలోనే ఈ చిత్రాన్ని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు సెట్స్‌కు వెళ్లలేదు.కాగా ఈ సినిమా పనులు ప్రారంభమయ్యాయని, 'ప్రేమలు, రైఫిల్‌క్లబ్' వంటి హిట్ చిత్రాలకు స్క్రీన్ రైటర్‌గా పని చేసిన శ్యామ్ పుష్కరన్ ఈ సినిమాకు అసోసియేట్ అయ్యారని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా పేర్కొంది. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.
ఇదిలా ఉంటే... ఫైట్ మాస్టర్స్ దర్శకత్వం వహిస్తున్నారు కాబట్టి ఈ చిత్రం యాక్షన్ ప్రాధాన్యంగా ఉంటుందని, కమల్ రిస్కీ స్టంట్స్ చేయనున్నారని కోలీవుడ్ టాక్

# ప్రపంచం కోరుకుంటోంది మహిళల నాయకత్వాన్నే

ఎన్ని సినిమాలు చేశామనేది కాదు.. ఎంత మంచి చిత్రాల్లో భాగమయ్యామనేదే ముఖ్యమని అంటోంది అందాల తార సమంత. తెరపై మెప్పిస్తూనే.. వైవిధ్యమైన కథలతో ఓటీటీ వేదికగానూ అదరగొడుతుందీ భామ. నిర్మాతగానూ రాణిస్తోంది. ప్రస్తుతం 'రక్త్‌బ్రహ్మాండ్:ది బ్లడీ కింగ్‌డమ్'తో బిజీగా గడుపుతున్న ఈమె.. ఇకపై ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టులు చేయనని చెబుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సమంత తన భవిష్యత్తు ప్రాజెక్టులు, సోషల్ మీడియా, ఆరోగ్యం గురించి పంచుకున్న ఆసక్తికర విషయా లివీ.
"నా జీవితంపై ప్రభావం చూపే మార్గదర్శకులను కనుగొనడంలో సహాయం చేసింది సోషల్ మీడియా. అందుకే ఇది అందరూ అనుకున్నట్లు ఎక్కువగా హాని కలిగించేదని నేను అనుకోను. చాలా వరకూ నేను సామాజిక మాధ్యమాల్లో వాస్తవంగా ఉండడానికే ప్రయత్నిస్తా. ఎక్కువగా ఈ మాధ్యమంలో ఆరోగ్యానికి సంబంధించిన పలు విషయాలను పంచుకుంటూ మంచి పనులే చేస్తున్నానని అనుకుంటున్నా. సోషల్ మీడియాలో వచ్చే అన్ని ప్రశంసలను ఎలా అంగీకరిస్తా



మో.. ట్రోలింగ్, నెగిటివ్ కామెంట్స్‌ను కూడా అలానే స్వీకరించగలగాలి. మీరు దాన్ని కంట్రోల్ చేయగలగాలి కానీ.. అది మీ జీవితాన్ని నియంత్రించకూడదు".

నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా

"నాకు సినిమాలు, ఫిట్‌నెస్ ఈ రెండింటిపై చాలా ఆసక్తి. ప్రస్తుతం వీటిపైనే దృష్టి పెడుతున్నా. గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో చాలా మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నా. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇప్పటి నుంచి ఒకేసారి ఎక్కువ ప్రాజెక్టులు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్టుల సంఖ్య తగ్గినా కానీ వాటి నాణ్యత పెరుగుతుంది".

అవన్నీ అవాస్తవాలని తెలుసుకున్నా

"బాల్యం నుంచే ఒక అమ్మాయిగా మీకు ఎప్పుడూ కొన్ని పరిమితులు ఉంటాయి. అప్పటి నుంచే మీరు చేయగలిగేది.. చేయకూడని విషయాలను గురించి చెప్తూ ఉంటారు. నేను అందరిలానే నా బాల్య జీవితాన్ని భయంతో గడిపాను. కానీ ముందుకెళ్తున్న కొద్దీ.. మనకు చిన్నప్పుడు నేర్పించినవన్నీ చాలా వరకు అవాస్తవమని తెలుసుకున్నా. అందుకే అమ్మాయిలందరికీ నేను చెప్పేది ఒక్కటే.. భయంతో ఏ పనిని మొదలు పెట్టొద్దు. మీ బలమేంటో తెలుసుకోవడానికి ఎలాంటి పనులను చేయాల్సిన అవసరం లేదు. మీపై పూర్తి నమ్మకంతో భవిష్యత్తులో ముందడుగు వేయండి".

నేర్చుకోవడంలో నిత్య విద్యార్థినే

"ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా ఓటీటీలోనూ విభిన్న కథల్లో నటిస్తున్నా. ఇది నేర్చుకునే దశ. అందుకే పరిశ్రమతో సంబంధం లేకుండా ప్రాజెక్టుల్ని ఎంచుకుంటున్నా. నేర్చుకోవడం ఎప్పటికీ ఆపను. చిత్రపరిశ్రమలో నేనూ ఒక నిత్యవిద్యార్థినే. నా వృత్తిలో మునుపటి కన్నా మెరుగ్గా ఉండాలనుకుంటున్నా. భవిష్యత్తులో సవాలుతో కూడిన పాత్రలు.. ముఖ్యంగా మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండే చిత్రాల్లో నటించాలనుకుంటున్నా. ఇలాంటి ప్రాజెక్టుల్ని పొందడం కొంచెం కష్టమే.. కానీ అదే నా



# ఆ పరిచయంతో...



హీరోయిన్ సాయిపల్లవి హిందీలో నటించిన తొలి చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ చిత్రం 'మేరే రహో'. సునీల్ పాండే దర్శకత్వంలో ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్ కానుంది. ఒకరితో ఒకరికి పరిచయం లేని ఓ అబ్బాయి, అమ్మాయి ఓ రోజు విచిత్రకరమైన పరిస్థితుల్లో కలుసుకుంటారు.
ఆ పరిచయం వారి జీవితాలను ఎలా మార్చేసింది? అన్న కోణంలో ఈ 'మేరే రహో' సాగుతుందని బాలీవుడ్ సమాచారం. తొలుత ఈ సినిమాకు 'ఏక్ దిన్' అనే టైటిల్ అనుకున్నారు. నవంబరులో రిలీజ్ ప్లాన్ చేశారు. శుక్రవారం ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా కాకుండా హిందీలో 'రామాయణ' సినిమాలో సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే.

# నిజాయతీగా ప్రేక్షకుల ప్రేమను పొందాం



ఒక కొత్త జానర్ సినిమాతో అందరికీ ఓ సరికొత్త అనుభూతిని ఇవ్వాలని చాలా కృషి చేసి చేసిన చిత్రం 'కిష్కింధపురి'. దీనితో నిజాయతీగా ప్రేక్షకుల ప్రేమను సంపాదించుకున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించారు. సాహు గారపాటి నిర్మించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "గురువారం మూడు ప్రీమియర్ షోలు వేద్దామనుకుని మొదలైన మా సినిమా 66షోలు పడ్డాయి. చాలా ఆర్గానిక్‌గా మా చిత్రం ప్రేక్షకులకు చేరువైంది. నేను ఈ సినిమాని వందల మంది మధ్య కూర్చొని చూశా. దీన్ని థియేటర్లో చూసిన ప్రతి ఒక్కరూ మంచి రెస్పాన్స్ ఇచ్చారు. ఇది విమర్శకుల్ని ఒప్పించేంత గొప్ప సినిమా కాకపోవచ్చు.. కానీ, ప్రేక్షక దేవుళ్లను మెప్పించే గొప్ప చిత్రమిది. పవన్ కల్యాణ్ 'ఓజీ' వచ్చేంత వరకు మా సినిమా వెళ్తూనే ఉంటుంది'' అన్నారు. "తొలిసారి హిట్టు కొట్టిన సందర్భం జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ క్షణాల్ని నేను అలాగే ఎప్పటికీ గుర్తుంచుకుంటా. బెల్లంకొండ శ్రీనివాస్, సాహు ఇచ్చిన సపోర్ట్‌తోనే ఇది సాధ్యమైంది'' అన్నారు దర్శకుడు కౌశిక్. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి మేము అనుకున్న దాని కన్నా రెట్టింపు ఆదరణ లభిస్తోంది. మా బ్యానర్ నుంచి మంచి సినిమా పడింది. చిత్ర పరిశ్రమ నుంచి చాలా మంది ఫోన్ చేసి ప్రశంసిస్తున్నార''ని అన్నారు. ఈ కార్యక్రమంలో చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ 'ప్రపంచం' పిలుస్తోంది!



నేటి నుంచి వరల్డ్ చాంపియన్‌షిప్
తొమ్మిది రోజులపాటు పతకాల వేట
భారత ఆశలన్నీ నీరజ్ చోప్రాపైనే

198 దేశాలు... 2000లకు పైగా అథ్లెట్లు... 49 ఈవెంట్లు... రికార్డులు బద్దలు కొట్టేందుకు... అంతర్జాతీయ వేదికపై అందరి దృష్టిని ఆకర్షించేందుకు... అథ్లెట్లందరూ 'సై' అంటున్నారు. స్ప్రింట్ రేసుల్లో అగ్రరాజ్యం అమెరికా ఆధిపత్యం కొనసాగుతుందా.... మిడిల్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా తమ హవా కొనసాగిస్తుందా... ఫీల్డ్ ఈవెంట్స్‌లో యూరోపియన్లు తమ సత్తా చాటుకుంటారా... ఇవన్నీ తెలుసుకోవాలంటే క్రీడాభిమానులు నేటి నుంచిమొదలయ్యే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌పై దృష్టి సారించాల్సిందే.

1983లో ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకిలో తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు వేదిక కాగా... తాజాగా 20వ ఎడిషన్‌కు జపాన్ రాజధాని టోక్యో ముస్తాబైంది. ఈ మెగా ఈవెంట్ జపాన్‌లో జరగడం ఇది మూడోసారి. ఇంతకుముందు 1991లో టోక్యో, 2007లో ఒసాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యమిచ్చాయి. టోక్యో: ఒలింపిక్స్ క్రీడలు... ఫుట్‌బాల్ ప్రపంచకప్... ఆ తర్వాత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించేది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్. రెండేళ్లకోసారి జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మొత్తం 198 దేశాల అథ్లెట్లు 49 ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తొలి రోజు ఐదు ఈవెంట్లలో అథ్లెట్లు మెడల్స్ కోసం బరిలోకి దిగనున్నారు.

పురుషుల, మహిళల 35 కిలోమీటర్ల రేస్ వాక్... అనంతరం పురుషుల షాట్‌పుట్, మహిళల 10,000 మీటర్లు, మిక్స్‌డ్ 4-400 మీటర్ల రిలే ఫైనల్ ఈవెంట్లు జరుగుతాయి. పురుషుల, మహిళల 100 మీటర్ల విభాగాల్లో ప్రిలిమినరీ రౌండ్‌లు ఉంటాయి. పురుషుల, మహిళల 100 మీటర్ల సెమీఫైనల్స్, ఫైనల్స్ ఆదివారం జరుగుతాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో నిషేధం ఎదుర్కొంటున్న రష్యా అథ్లెట్లు ఈ మెగా ఈవెంట్‌లో 'తటస్థ అథ్లెట్లు'గా పోటీ పడనున్నారు. జమైకా దిగ్గజ మహిళా స్ప్రింటర్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ 'టోక్యో'లో తన కెరీర్‌ను ముగించనుంది. ఇప్పటి వరకు ఆమె ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో వ్యక్తిగత, టీమ్ రిలే ఈవెంట్స్‌లో కలిపి మొత్తం 16 పతకాలు సాధించింది. ఇందులో 10 స్వర్ణాలు, 5 రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి.

మరోవైపు పురుషుల పోల్ వాల్ట్‌లో స్వీడన్ స్టార్ డుప్లాంటిస్ ప్రధాన ఆకర్షణ కానున్నాడు. ఇప్పటికే 13 సార్లు పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డులు నెలకొల్పిన డుప్లాంటిస్ స్వర్ణం సాధించి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'హ్యాట్రిక్' నమోదు చేయాలని పట్టుదలతో ఉన్నాడు. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు నెగ్గిన డుప్లాంటిస్, 2019లో రజత పతకం సాధించాడు. నీరజ్ ఈవెంట్ 17న, 18న... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈసారి భారత్ నుంచి 19 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. అయితే అందరి దృష్టి మాత్రం జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే ఉంది. ఈ మెగా ఈవెంట్‌లో 2022లో రజతం, 2023లో స్వర్ణం గెలిచిన నీరజ్... మళ్లీ విజేతగా నిలిస్తే... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండుసార్లు బంగారు పతకాలు నెగ్గిన మూడో జావెలిన్ త్రోయర్‌గా గుర్తింపు పొందుతాడు. గతంలో జాన్ జెలెజ్నీ (1993, 1995), అండర్సన్ పీటర్స్ (2019, 2022) మాత్రమే ఈ ఘనత సాధించారు. నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఈవెంట్ రెండు రోజులపాటు జరుగుతుంది. ఈనెల 17న క్వాలిఫయింగ్... 18న ఫైనల్ ఉంటాయి. జావెలిన్ త్రోలో భారత్ నుంచి నీరజ్ చోప్రాతోపాటు సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ బరిలో ఉన్నారు. మహిళల జావెలిన్ త్రోలో భారత స్టార్ అన్ను రాణి ఐదోసారి (2017, 2019, 2022, 2023) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడనుంది.

2019, 2022లో ఫైనల్ చేరిన అన్ను రాణి ఈసారి ఏం చేస్తుందో వేచి చూడాలి. తొలి రోజు శనివారం భారత్ నుంచి నలుగురు అథ్లెట్లు బరిలో ఉన్నారు. పురుషుల 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో రామ్‌బాబూ, సందీప్ కుమార్... మహిళల 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో ప్రియాంక గోస్వామి... మహిళల 1500 మీటర్ల హీట్స్‌లో పూజ పోటీపడతారు. ఇదీ భారత బృందం... పురుషుల విభాగం: నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ (జావెలిన్ త్రో), గుల్‌వీర్ సింగ్ (5000, 10000 మీటర్లు), ప్రవీణ్ చిత్రావెల్, అబ్దుల్లా అబూబాకర్ (ట్రిపుల్ జంప్), మురళీ శ్రీశంకర్ (లాంగ్‌జంప్), సర్వేశ్ కుషారే (హైజంప్), అనిమేశ్ కుజుర్ (200 మీటర్లు), తేజస్ షిర్సే (110 మీటర్ల హర్డిల్స్), సెర్విన్ సెబాస్టియన్ (20 కిలోమీటర్ల రేస్ వాక్), రామ్‌బాబూ, సందీప్ కుమార్ (35 కిలోమీటర్ల రేస్ వాక్). మహిళల విభాగం: అన్ను రాణి (జావెలిన్ త్రో), పారుల్ చౌధరీ, అంకిత దయాని (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), పూజ (800, 1500 మీటర్లు), ప్రియాంక గోస్వామి (35 కిలోమీటర్ల రేస్ వాక్). 443 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో అమెరికా సాధించిన పతకాలు. ఇందులో 195 స్వర్ణాలు, 134 రజతాలు, 114 కాంస్యాలు ఉన్నాయి. 'ఆల్‌టైమ్ పతకాల పట్టిక'లో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 171 పతకాలతో (65 స్వర్ణాలు, 58 రజతాలు, 48 కాంస్యాలు) కెన్యా రెండో స్థానంలో ఉంది.

3 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన పతకాలు. 2003లో అంజూ జార్జ్ మహిళల లాంగ్‌జంప్‌లో కాంస్యం నెగ్గగా.. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 2022లో రజతం, 2023లో స్వర్ణం గెలిచాడు. ఆల్‌టైమ్ పతకాల పట్టికలో భారత్... బుర్కినఫాసో, ట్యునీసియాలతో కలిసి సంయుక్తంగా 65వ స్థానంలో ఉంది.

# ఆసియా కప్.. ప్చ్.. అభిమానుల్లో ఏదీ ఆసక్తి!




సాధారణంగా ఐసీసీ టోర్నమెంట్లు అంటే.. కొన్ని రోజులు ముందుగానే సందడి నెలకొంటుంది. టీవీలు, యూట్యూబ్ ఛానళ్లలో క్రికెట్ పండితులు, మాజీల చర్చలు, విశ్లేషణలు వేడిని రాజేస్తాయి. కానీ ప్రస్తుతం ఆసియా కప్ (Asia cup) నేపథ్యంలో ఆ పండుగ వాతావరణం కనిపించడం లేదు. ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎనిమిది జట్లు పోటీలో పాల్గొంటున్నా.. అభిమానులను ఆకర్షించడంలో ఆసియా కప్ విఫలమవుతోంది. టీమ్ఇండియా (Team India), శ్రీలంక, పాకిస్థాన్‌లాంటి మేటి జట్లు పాల్గొంటున్నప్పటికీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఆ జోష్ కనిపించడం లేదు.

**మ్యాచుల్లో కనిపించని ఉత్కంఠ..!**

ఆసియా కప్ చప్పగా సాగటానికి మ్యాచుల్లో ఉత్కంఠ లోపించడమూ ఓ కారణమే. ఇప్పటివరకు (గురువారం వరకు) మూడు మ్యాచ్‌లు పూర్తైతే.. ఆ మూడూ ఏక పక్షంగానే సాగాయి. ఈ మెగా టోర్నీ సెప్టెంబర్ 9న అఫ్గానిస్థాన్, హాంకాంగ్ మ్యాచ్‌తో ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ ఏక పక్షంగా 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. తర్వాత సెప్టెంబర్ 10న టీమ్ఇండియా, యూఏఈ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో యూఏఈ ఏ దశలోనూ టీమ్ఇండియాకు కనీస పోటీ కూడా ఇవ్వలేదు. ఈ మ్యాచ్‌ను భారత జట్టు 4.3 ఓవర్లలోనే ముగించి, 9 వికెట్ల తేడాతో భారీ విజయం సొంతం చేసుకుంది. సెప్టెంబర్ 11న హాంకాంగ్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ కూడా చప్పగానే సాగింది. ఈ పోరులో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మూడు మ్యాచుల్లోనూ విజేత ఎవరో ముందే తేలిపోయింది. దీంతో ఈ మ్యాచ్‌ల మీద ఎవరికీ పెద్దగా ఆసక్తి లేకుండా పోయింది. గ్రూప్ స్టేజీలో మ్యాచ్‌లన్నీ దాదాపు ఇలాగే ఉండనున్నాయి!

పాకిస్థాన్‌పై టీమ్ఇండియాదే పైచేయి..'

**కనీసం అప్పుడైనా..**

గ్రూప్ స్టేజీ తర్వాత ఆరు సూపర్ 4 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లు 20 సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లైనా ప్రేక్షకులను కట్టిపడేస్తాయా.. అంటే ఎటూ చెప్పలేని పరిస్థితి. దీనికి తోడు.. పహల్గాం దాడి తర్వాత ఇండియా, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసలు పాకిస్థాన్‌తో.. టీమ్ఇండియా ఏ విధమైన క్రికెట్ సంబంధాలు కొనసాగించకూడదని భారత అభిమానులు కోరుకుంటున్నారు. ఎప్పుడూ హాట్ కేకుల్లా అమ్ముడుపోయే భారత్, పాక్ మ్యాచ్ టికెట్లు ఈ సారి కొనేవారు లేక మిగిలిపోయాయి! అధిక ధరలూ మరో కారణమనే వాదనలూ వినిపిస్తున్నాయి. అయితే, ఈసారి టీవీల్లోనూ వీక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశముందని పలువురు క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు.

**మారాల్సిందే.. మార్చాల్సిందే..**

టీ20 క్రికెట్‌కు ప్రస్తుతం విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ ఫార్మాట్లోనే ఆసియా కప్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఈ టోర్నీకి ఆదరణ దక్కడం లేదు. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ (Ravichandran Ashwin) సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అతడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆసియా కప్‌లో అసలు సిసలైన పోటీ ఎక్కడ? అని అతడు నేరుగానే ప్రశ్నించాడు. ఆసియా కప్ ప్రమాణాలు పడిపోతున్నాయంటూ కుండబద్దలు కొట్టాడు. ఈ టోర్నీని 2026లో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌నకు సన్నాహకంగా అనుకోవడం సరికాదని ముక్కుసూటిగా తేల్చిచెప్పేశాడు. పలువురు మాజీలూ దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో మ్యాచ్‌లను ఆసక్తికరంగా మార్చాలంటే.. ఆసియా కప్‌లో సమూల మార్పులు చేయక తప్పదు. ఇది జరిగితేనే ఇకపై జరగబోయే ఆసియా కప్‌లు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తాయి!

# బెంగళూరు హ్యాట్రిక్




జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్ 12లో బెంగళూరు బుల్స్ విజయాల హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం ఆ జట్టు 2823తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడుతున్న జైపూర్ మ్యాచ్ ఆరంభంలో మెరుగ్గానే ఆడింది. ఒక దశలో 55తో ప్రత్యర్థితో సమానంగా నిలిచింది. ఆ తర్వాత ఆ జట్టు తడబడింది. అలీరెజా విజృంభించడంతో జైపూర్‌ను ఆలౌట్ చేసిన బెంగళూరు 169తో బ్రేక్‌కు వెళ్లింది. విరామం తర్వాత జైపూర్ పుంజుకుంది. నితిన్ కుమార్ (8) రాణించడంతో 1521తో ప్రత్యర్థికి సమీపంగా వచ్చింది. మరోవైపు బెంగళూరు తగ్గలేదు. చివరి అయిదు నిమిషాల్లో ఆ జట్టు మరింత దూకుడుగా ఆడింది. ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అలీరెజా (8), దీపక్ (5) బెంగళూరును గెలిపించారు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 4636తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది.

# రూట్ ఒక్క సెంచరీ చెయ్.. మా నాన్న నుంచి కాపాడు

## : హేడెన్ కుమార్తె విన్నపం



అత్యంత ప్రతిష్ఠాత్మక టెస్టు సిరీసుల్లో యాషెస్ ఒకటి. ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా (England vs Australia) జట్ల మధ్య జరిగే ఐదు టెస్టుల యాషెస్‌పై సర్వత్రా ఆసక్తి ఉంటుంది. ఇక్కడ సెంచరీ చేసినా, ఐదు వికెట్ల ప్రదర్శన చేసినా చాలు వారి పేరు మారుమోగిపోతుంది. ఈ ఏడాది ఆస్ట్రేలియా వేదికగా యాషెస్ సిరీస్ జరగనుంది. ఈ క్రమంలో ఆసీస్ మాజీ ఆటగాడు మ్యాథ్యూ హేడెన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. దీంతో ప్రత్యర్థి బ్యాటర్‌ను కూడా సెంచరీ చేయమనే పరిస్థితి హేడెన్ కుమార్తెకు వచ్చింది. అసలు మ్యాథ్యూ హేడెన్ ఏమన్నాడు? ఆయన కుమార్తె గ్రేస్ హేడెన్ విన్నపం ఏంటో చూద్దాం..

సచిన్ వల్లే క్రికెట్‌లోకి వచ్చా.. కోహ్లీ నిబద్ధతే నాపై చెరగని ముద్ర వేసింది: గిల్

ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న క్రికెటర్ జో రూట్. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ తెందూల్కర్ (15,921) రికార్డుకు చేరువగా ఉన్న ఆటగాడు కూడా అతడే. మరో 2,400 పరుగులు చేస్తే ఆ రికార్డు సొంతమవుతుంది. ఈ క్రమంలో రాబోయే టెస్టు సిరీస్ రూట్‌కు అత్యంత కీలకం. అయితే, ఆసీస్ మాజీ ఆటగాడు మ్యాథ్యూ హేడెన్ మాత్రం రూట్‌పై ఒత్తిడి పెంచేలా ఓ సవాల్ విసిరాడు. ఒకవేళ యాషెస్ సిరీస్ (Ashes Series)లో రూట్ ఒక్క సెంచరీ కూడా చేయకపోతే తాను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో 'నగ్నంగా నడుస్తా' అని సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు.

హేడెన్ కామెంట్లకు విపరీతమైన స్పందన వచ్చింది. అందులో హేడెన్ కుమార్తె, క్రీడా వ్యాఖ్యాత గ్రేస్ హేడెన్ కూడా ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా రూట్‌కు ఓ విన్నపం చేసింది. "ప్లీజ్ రూట్.. ఒక్క సెంచరీ అయినా చెయ్" అని కామెంట్ సెక్షన్‌లో పోస్టు చేసింది. రూట్‌కు ఆసీస్ గడ్డపై ఒక్క టెస్టు శతకం కూడా లేకపోవడం గమనార్హం. దీంతో ఆసీస్ బౌలర్లు రూట్ విషయంలో ఏం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 21 నుంచి పెర్త్ వేదికగా తొలి టెస్టు మొదలుకానుంది. మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది.

# పసిడి పోరుకు జైస్మీన్, నుపుర్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లాంబోరియా, నుపుర్ షెరాన్ అదరగొట్టారు. జోరు కొనసాగిస్తూ ఫైనల్ దూసుకెళ్లి పసిడికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం మహిళల 57 కేజీల సెమీస్‌లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనిజువెలా)ను చిత్తు చేసింది. ఫైనల్లో ఆమె పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జులియా (పోలెండ్)ను ఢీకొంటుంది. మరో సెమీస్‌లో నుపుర్ షెరాన్ (80 కేజీల విభాగం) 5-0తో డుజ్గస్ సెమ (తుర్కియే)ను ఓడించింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన నుపుర్ ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. మరోవైపు మీనాక్షి హుడా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో



సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసింది. 48 కేజీల క్వార్టర్‌ఫైనల్లో అండర్-19 ప్రపంచ ఛాంపియన్ అలిస్ పామ్‌ఫెరి (ఇంగ్లాండ్)ను మీనాక్షి చిత్తు చేసింది. ఈ బౌట్లో తన ఎత్తును ఉపయోగించుకుంటూ ఆమె తెలివిగా ఆడింది. బ్యాక్‌ఫుట్‌పైనే ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో స్థానం కోసం అల్టాంట్ (మంగోలియా)తో భారత బాక్సర్ అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు పురుషుల్లో జాదుమణి సింగ్ పోరాటం ముగిసింది. 50 కేజీల క్వార్టర్స్‌లో ప్రపంచ ఛాంపియన్ సాన్‌జార్ (కజకిస్తాన్) చేతిలో జాదుమణి పోరాడి ఓడిపోయాడు. దీంతో పురుషుల్లో భారత్ పోటీ ముగిసింది. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించలేకపోవడం ఇదే తొలిసారి.

# భారత్ 2 న్యూజిలాండ్ 0

బీల్ (స్విట్జర్లాండ్): న్యూజిలాండ్‌తో డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్ 1 పోరులో భారత్ శుభారంభం చేసింది. అరంగేట్ర ఆటగాడు దక్షిణేశ్వర్ సురేశ్, సుమిత్ నగాల్ సత్తా చాటడంతో శుక్రవారం రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారతే గెలిచింది. తొలి సింగిల్స్‌లో దక్షిణేశ్వర్ 76 (75), 63తో జెరోమ్ కిమ్‌ను కంగుతినిపించాడు. అనుభవం లేని దక్షిణేశ్వర్ ఈ మ్యాచ్‌లో అనూహ్య ప్రదర్శన చేశాడు. బలమైన సర్వీసులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టాడు. నెట్ గేమ్‌లోనే ఎక్కువ పాయింట్లు సాధించాడు. కిమ్ కూడా పుంజుకోవడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్‌లో సర్వీసులతో విజృంభించిన దక్షిణేశ్వర్ తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్లో మరింత ఆత్మవిశ్వాసంతో ఆడిన భారత కుర్రాడు 53తో ఆధిక్యంలో నిలవడమే కాక.. అదే జోరుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. సింగిల్స్‌లో కిమ్ ర్యాంకు 179 కాగా.. దక్షిణేశ్వర్ 626వ ర్యాంకులో ఉండడం గమనార్హం. రిజర్వ్ ఆటగాళ్లలో ఉన్న దక్షిణేశ్వర్‌ను ఇటీవల మెరుగైన ప్రదర్శన కారణంగా నేరుగా సింగిల్స్ ఆడే అవకాశం కల్పించాడు కెప్టెన్ రాజ్‌పాల్. ఆ నమ్మకాన్ని దక్షిణేశ్వర్ వమ్ము చేయలేదు. రెండో సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 63, 76 (74)తో మార్క్ హస్లర్‌ను ఓడించాడు. తొలి సెట్‌ను తేలిగ్గానే గెలిచిన నగాల్‌కు రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఈ సెట్‌ను అతడు టైబ్రేకర్‌లో గెలిచి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. శనివారం డబుల్స్ పోరులో రిత్విక్ బొల్లిపల్లి శ్రీరామ్ బాలాజీ జంట జాకబ్ పాల్‌డొమినిక్ స్ట్రీకర్ ద్వయంతో తలపడనుంది. భారత ఐరోపా జట్టుపై విదేశాల్లో చివరగా 1993లో నెగ్గింది. లియాండర్‌పేస్, రమేశ్ కృష్ణన్‌లతో కూడిన జట్టు డేవిస్‌కప్ క్వార్టర్‌స్‌లో అప్పుడు ఫ్రాన్స్‌పై 32తో గెలిచింది.

